
క్లుప్తంగా

సీఎం జగన్‌కు సాదర స్వాగతం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన కోసం విచ్చేసిన సీఎంకు పుష్పగుచ్ఛాలనందించి, సాదరంగా స్వాగతించారు. - అక్కిరెడ్డిపాలెం

వైభవంగా సూర్యభగవానుడి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్టించిన సూర్యభగవానుడి విగ్రహం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సూర్యనారాయణస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. యువ హిందూ సాంస్కృతిక సంఘ్ ఆధ్వర్యంలో విశేష పూజలు, చప్పన్ భోగ్, హవాన్, మహాహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గాజువాక: చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శ్రామికనగర్ 11కేవీ ఫీడర్‌కు ఈ నెల 5న నిర్వహణ పనులు నిర్వహించనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా దత్తసాయి నగర్, శ్రీనివాస నగర్, శ్రామిక నగర్, ఎర్రగడ్డ కాలనీలకు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

250 మందికి చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న నర్సింగరావు

గాజువాక: బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు 250 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పాతకర్ణవానిపాలెంలో బుధవారం నిర్వహించిన తన జన్మదిన వేడుకల్లో భాగంగా పేద మహిళలకు, జీవీఎంసీ ప్రజారోగ్య విభాగానికి చెందిన మహిళా కార్మికులకు ఆయన చీరలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గూటూరు శంకరరావు, బాటా శ్రీనివాస్, సిరసపల్లి నూకరాజు, లక్కరాజు సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో నర్సింగ్ క్లోక్‌రూమ్ ప్రారంభం



క్లోక్ రూమ్‌ను ప్రారంభిస్తున్న డా. అశోక్‌కుమార్

మహారాణిపేట : కేజీహెచ్‌లో నర్సుల కోసం రూ.రెండు లక్షల 50 వేల వ్యయంతో పునర్నిర్మించిన క్లోక్ రూమ్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసకుమార్, ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవరావు నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



కూర్మన్నపాలెం ప్రాంతంలో కురుస్తున్న వర్షం

- పొంగి పొర్లిన గెడ్డలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

పెదగంట్యాడ: వర్షం దంచి కొట్టింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై, తర్వాత చిన్నగా వర్షం ప్రారంభమైంది. అటుపై ఏకధాటిగా కురిసింది. సాయంత్రం వరకు ఒకే రీతిన వాన పడడంతో మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. పెదగంట్యాడ సచివాలయం 1, 2, 3 ప్రాంగణం మొత్తం వర్షపునీటితో నిండిపోయింది. చెరువులా మారిపోయింది. రైతుబజార్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని నివాసితుల ఇళ్లలోకి నీరు రావడంతో అవస్థలు పడ్డారు. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు సాగించలేకపోయారు.



నడుపూరు పైడిమాంబ అమ్మవారి ఆలయం ఎదురుగా..

పెదపాలెం వంతెన వద్ద పొంగిన గెడ్డ

పెదపాలెం వంతెన వద్ద గెడ్డ పొంగి, ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.

పోర్టు వంతెన వద్ద చెత్త తొలగింపు

వర్షం దెబ్బకు గెడ్డల నుంచి పోర్టు వంతెన వద్దకు ఎగువ నుంచి వచ్చిన వర్షపునీటితో పాటు చెత్తాచెదారం కొట్టుకువచ్చింది. ఇది కాస్తా నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో నిర్వాసిత నాయకుడు పులి వెంకటరమణారెడ్డి అక్కడకు చేరుకుని జీవీఎంసీ సిబ్బందితో చెత్తను తీయించారు. దీంతో నీరు సాఫీగా సముద్రంలోకి వెళ్లిపోయింది.

రైల్వేస్టేషన్ బస్టాప్‌లో నిలిచిన నీరు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు ఉన్న బస్టాప్ వద్ద వర్షపునీరు చేరింది. సిటీ బస్సులు నిలిపే చోట ప్లాట్‌ఫాం వాలి ఉండడంతో బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి నీరు నిలిచిపోయింది. దీంతో రోడ్డుమీదే సిటీ బస్సులు నిలిపివేయడంతో ఆటోలు, వాహనాల రద్దీతో బస్టాప్ వద్ద ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



పెదపాలెంలో రోడ్డుపై నీటి ప్రవాహంతో నిలిచిన రాకపోకలు



దువ్వాడ రైల్వేస్టేషన్ బస్టాప్ వద్ద నిలిచిన వర్షపునీరు

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలో బుధవారం కురిసిన వర్షానికి ప్రధాన గెడ్డలు వర్షపునీటితో నిండిపోయాయి. రోడ్లలన్నీ జలమయం కావడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. వర్షం వల్ల ప్రజలు బయటకు రాకపోవడంతో దుకాణాలు వెలవెలబోయాయి.



పెదగంట్యాడ సచివాలయం 1,2,3 ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు

ఘనంగా ఇంటక్ వ్యవస్థాపక దినోత్సవం



స్టీల్‌ప్లాంట్‌లో పతాకం ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం: ఐఎన్‌టీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు స్టీల్‌ప్లాంట్‌లో యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా యూనియన్ ఆవిర్భవించి, సర్దార్ వల్లభాయ్ పటేల్, నేతాజీ, గుల్జారీ వంటి పెద్దల చేతుల మీదుగా ఎదిగి నేడు 3.48 కోట్ల సభ్యులను కలిగి ఉందన్నారు. కార్మిక వర్గ ప్రయోజనాల సాధనలో యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.ఎస్. రాజు, కారు రమణ, నాయక్, సంపూర్ణం, సుబ్బయ్య, అవతారం, జెర్రిపోతుల మోహన్‌కుమార్, గంగవరం గోపీ తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్ఈఎల్‌లో..

అక్కిరెడ్డిపాలెం: ఇంటక్ ఆవిర్భావ దినోత్సవాన్ని బీహెచ్ఈఎల్‌లో ఘనంగా నిర్వహించారు. భెల్ ప్రవేశ గేటు వద్ద జోరువానలో ఇంటక్ నాయకుడు సీహెచ్.నారాయణరావు జెండాను ఎగరవేశారు. ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు ప్రసంగించారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు వారాడ ఆనందరావు, సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, బీఈఆర్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, ఏఐసీటీయూ నాయకుడు డి.చిట్టిబాబు, వైఎస్సార్‌టీయూసీ నాయకుడు ఎస్.ఎల్.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రోడ్డును పరిశీలించిన స్టీల్‌ప్లాంట్ అధికారులు



బీసీ రోడ్డును పరిశీలిస్తున్న స్టీల్‌ప్లాంట్ అధికారులు

పెదగంట్యాడ: బీసీ రోడ్డును పూర్తి స్థాయిలో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ హెచ్‌వోడీ వై.చంద్రశేఖర్ (జీఎం), సీజీఎం జి.గాంధీ, డీజీఎం బాబూ నాయక్ తెలిపారు. స్టీల్ వైఎస్సార్ టీయూసీ ఆధ్వర్యంలో బీసీ రోడ్డును విస్తరించాలని కోరుతూ ఇటీవల వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఉక్కు అధికారులు బుధవారం బీసీ రోడ్డును పరిశీలించారు. వారు మాట్లాడుతూ పెదగంట్యాడ జంక్షన్ నుంచి గంగవరం పోర్టు గేటు వరకు రోడ్డు ఛిద్రం కావడంతో వెంటనే మైనర్ రిపేర్లు చేయిస్తామని, టెండర్లు పిలిచి రోడ్డు విస్తరణ పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, సంపంగి ఈశ్వరరావు, పిట్టా రెడ్డి, బోగాది సన్నీ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సహ కార్మికుల చేయూత



మృతుని భార్య ఈర్ని మేరీకి చెక్కు అందజేస్తున్న మంత్రి రవి తదితరులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ బీఎఫ్-3లో పని చేస్తూ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి తోటి కార్మికులు అండగా నిలిచారు. వారికి ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. జీవీఎంసీ 77వ వార్డు కేఎస్ పాలేనికి చెందిన ఈర్ని గోవింద్ ఇటీవల మృతి చెందాడు. అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో తోటి కార్మికులతో పాటు పీఎల్‌ఏ యాజమాన్యం, టీఈజేవో యాజమాన్యం కలసి రూ.2.09లక్షలు సేకరించారు. ఆ చెక్కును ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి చేతుల మీదుగా మృతుని భార్య పేర్ని మేరీకి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సైట్ లీడర్స్ రెడ్డి, మహేంద్ర, హైదర్ ఆలీ, పద్మనాభం, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణ

యువతకు సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందిస్తున్న నర్సింగరావు

పెదగంట్యాడ: కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారు దానిని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా స్థిరపడాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. కల్చర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సామాజిక భవనంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న 32 మందికి కేఎస్ఆర్ చేతుల మీదుగా బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పేర్ల అప్పారావు, గిరి చరణ్‌నాయుడు, గరికిన పైడిరాజు, గూటూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులపై ఆందోళన



స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళన చేస్తున్న పోరాట కమిటీ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. రాస్తారోకో చేస్తున్న 26 మంది నాయకులను అరెస్ట్ చేసి స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో, పోలీస్ స్టేషన్ వద్ద నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అరెస్టులు ప్రజా వ్యతిరేక, దివాలాకోరు విధానాలకు నిదర్శనమన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, 78వ వార్డు కార్పొరేటర్ జి.గంగారావు, యు. రామస్వామి, కె.ఎం. శ్రీనివాస్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణ ప్రతీ కార్మికుడి బాధ్యత



811వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: నిర్బంధాలు, అణచివేతలతో ఉక్కు ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు 811వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలు కార్మిక సంఘాల నేతలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. రాష్ట్రంలోని ప్రతి కార్మికుడు తన వంతు కర్తవ్యంగా ఉక్కు ఉద్యమాన్ని మరింత బలపరచవలసిన అవసరం ఆసన్నమైందన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలను కేంద్ర ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు టీడీపీ కార్పొరేటర్ల అభినందన



ఎమ్మెల్యే నాగిరెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న టీడీపీ కార్పొరేటర్లు

పెదగంట్యాడ: సుమారు 35ఏళ్ల పాటు పరిష్కారం కాని సమస్యను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పరిష్కరించారని టీడీపీ కార్పొరేటర్లు బొండా జగన్, లేళ్ల కోటేశ్వరరావు, మొల్లి ముత్యాలనాయుడు, కాకి గోవిందరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నాగిరెడ్డిని ఆయన స్వగృహంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ తుంగ్లాం, యాదవజగ్గరాజుపేట, ఫకీర్‌తక్యా, వడ్లపూడి గ్రామాలకు చెందిన ఏపీఐఐసీ నిర్వాసితుల ఇళ్ల స్థలాల సమస్యను ఎమ్మెల్యే నాగిరెడ్డి ఒక కొలిక్కి తీసుకువచ్చారన్నారు. ఇది శుభ పరిణామమని, ఎమ్మెల్యే నాగిరెడ్డి కృషికి ఫలితమని కొనియాడారు.

త్వరలో అందుబాటులోకి ఎంఎస్‌ఎంఈ పరిపాలన భవనం



ఆటోనగర్ డీ బ్లాక్‌లో నిర్మాణం పూర్తయిన ఎంఎస్‌ఎంఈ పరిపాలనా భవనం

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ డీ బ్లాక్‌లో సూక్ష్మ, లఘు మరియు మధ్యతరహా పరిశ్రమల శాఖ (ఎంఎస్ఎంఈ) నూతన భవనం త్వరలో అందుబాటులోకి కానుంది. ఇప్పటికే భవన నిర్మాణం దాదాపు పూర్తయింది. గతంలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన కార్యకలాపాలను హైదరాబాదులోని ఎంఎస్‌ఎంఈ కేంద్రప్రభుత్వ కార్యాలయం నుంచే నిర్వహించేవారు. రాష్ట్ర విభజన అనంతరం ఎంఎస్‌ఎంఈ ప్రధాన కార్యాలయం నిర్మాణాన్ని చేపట్టారు. రూ.9 కోట్ల వ్యయంతో ఈ భవనం నిర్మాణం చేపట్టినట్లు అధికార వర్గాల సమాచారం. కార్యాలయం ప్రారంభమైతే పరిశ్రమల సమాచారం, నూతన పరిశ్రమల ఏర్పాటు, స్థాపనకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవసరమైన వివరాలు, పరిశ్రమల స్థాపనకు శిక్షణ, పారిశ్రామిక వేత్తలకు సలహాలు, సందేహాల నివృత్తి తదితర సేవలు ఇక్కడే పొందవచ్చు. ఎంఎస్‌ఎంఈ పరిపాలనా భవనం త్వరలో అందుబాటులో రానుండటంతో పారిశ్రామిక వేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వెంకన్న సన్నిధిలో వైదిక సదస్యం



వైదిక సదస్యంలో పాల్గొన్న వేదపండితులు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా సోమవారం శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం ఆలయ కల్యాణమండపంలో వైదిక సదస్యం నిర్వహించారు. వేద పండితులు గురునాథ్ శర్మ, శ్రీనివాసశర్మ, ఘనాపాఠీలు పాల్గొని నాలుగు వేదాలు వల్లె వేశారు. వేద పఠనంతో వెంకటేశ్వరమెట్ట మార్మోగింది. వేంకటేశ్వరుని వైభవాన్ని పండిత శ్రేష్ఠులు వివరించారు. అనంతరం ఆలయ ఈవో జీవీ రమాబాయ్ పండితులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామివారికి బాలభోగం, హోమాలు, అర్చన, నివేదన, మంగళాశాసనములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

7న అల్లూరి వర్ధంతి కార్యక్రమాలు

ఏయూ క్యాంపస్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి కార్యక్రమాలు ఆంధ్ర విశ్వకళా పరిషత్, తెలుగు, సంగీత నృత్య శాఖల సంయుక్తంగా సమైక్య భారతి స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఈ నెల 7న నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఏయూ సంగీత విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెక్టార్ ఆచార్య కె.సమత ఈ మేరకు వివరాలు వెల్లడించారు. తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన అల్లూరిని స్మరించుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. బీచ్ రోడ్డులో 7వ తేదీ ఉదయం 10 గంటలకు గాంధీ పార్కు, దసపల్లా హిల్స్ వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు బీచ్ రోడ్డులో స్వాతంత్ర్య సమరయోధుల మైదానంలో సంగీత నృత్య శాఖల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. సమావేశంలో విజయ నిర్మాణ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎస్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకోలు

గాజువాక ప్రాంతంలో 41 మంది అరెస్టు



గాజువాకలో పల్లా శ్రీనివాసరావు, నర్సింగరావును అరెస్టు చేస్తున్న పోలీసులు



కార్మిక నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ వివిధ కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకోలను విస్తృతంగా నిర్వహించారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ పిలుపు మేరకు ఎక్కడికక్కడ ఆందోళనలు జరిగాయి. ఉక్కు పోరాటంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మంత్రి రాజశేఖర్, తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు 41 మంది కార్మిక, రాజకీయ నాయకులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని గాజువాక, దువ్వాడ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

- పాతగాజువాకలో రాస్తారోకోలో పాల్గొన్న వారిలో 15 మంది నాయకులను గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, నాయకులు వై.మస్తానప్పు, కసిరెడ్డి సత్యనారాయణ, ఎం.రాంబాబు సహా పలువురు నాయకులున్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సమష్టి బాధ్యత

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. దీనికోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి పోరాటాన్ని ఉధృతం చేయాలని కోరారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ దేశభక్తి ముసుగులో స్టీల్‌ప్లాంట్‌ను దక్షిణ కొరియా కంపెనీకి అమ్మాలని మోదీ ప్రభుత్వం చూస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పెదగంట్యాడ జంక్షన్‌లో..

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్షాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో తిప్పల దేవన్‌రెడ్డి, దల్లి గోవింద్, మార్టుపూడి పరదేశి, జె.ముత్యాలు, నమ్మి సింహాద్రి, వై.శ్రీనివాసరావు, అప్పారావు, మంత్రి శంకరనారాయణ, డీవీ రమణారెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గణపతిరెడ్డి, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 రోజుల్లోనే కొత్త చిగురు..



ఆకులన్నీ రాలి, మోడు వారిన చెట్టు పది రోజుల్లోనే చిగురించి సందర్శకులను ఆకర్షిస్తోంది. 69వ వార్డు నాతయ్యపాలెంలో బంక నెక్కెర చెట్టు ఏప్రిల్ నెలలో ఆకులన్నీ రాలి, నిర్జీవంగా కనిపించింది. కేవలం కొమ్మలు మాత్రమే కనిపించాయి. మళ్లీ పది రోజుల్లో చిగురు పూసి, కొమ్మలన్నీ ఆకులతో నిండిపోవడంతో పచ్చగా కళకళలాడుతూ దర్శనమిచ్చింది. వైఎస్సార్ సీపీ 69వ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు నివాసం వద్ద కనిపించిన దృశ్యమిది. . -అక్కిరెడ్డిపాలెం

8 గంటల పని విధానం అమలుకు డిమాండ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ డిస్పాచ్ యార్డ్ (సీడీవై)లో తారాచంద్ లాజిస్టిక్ కంపెనీలో 8 గంటల పని విధానం అమలు చేయాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఓ.వి.రావు మాట్లాడుతూ లాజిస్టిక్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నా, ఉక్కు యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. ధర్నా చేయకుండా గేట్లు మూసివేసి పరోక్షంగా తారాచంద్ యాజమాన్యానికి ఉక్కు యాజమాన్యం కొమ్ము కాస్తోందని ఆరోపించారు. 8 గంటల పని విధానం గురించి అడిగిన వారిని పనుల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. పరిస్థితిలో మార్పు రాకపోతే ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, వి. వరహాలు, కె.పి. సుబ్రమణ్యం, ఎస్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.